క్లుప్తంగా

కళాకారుడు వెంకటరామయ్యకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం తిరుగులేని మనిషి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం దేవాంతకుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు నరాలశెట్టి వెంకటరామయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోగినేని రామకృష్ణ, ఆలపాటి వీరాంజనేయులు, అడపా సంపతరావు, దేవినేని శ్రీనివాసమూర్తి, దేవభక్తుని ఉమామహేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, సుంకర హరికృష్ణ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



దేవకుమార్ మృతదేహం

తెనాలిరూరల్: గుండె పోటుతో హోంగార్డు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన గొట్టిముక్కల దేవకుమార్(48) తెనాలిలో హోంగార్డుగా ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నాడు. స్థానికంగా నివాసం ఉంటున్న అతనికి.. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అప్పటికే దేవకుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ముస్లింలకు గంజి పంపిణీ



పట్నంబజారు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉపవాసాల అనంతరం తీసుకునే గంజిని సోమవారం నగర డిప్యూటీ మేయర్ షేక్ సజీల మాయాబజారులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లింలు కఠిన ఉపవాసాల అనంతరం గంజి తీసుకుంటారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో అబ్దుల్ సత్తార్, మొహమ్మద్ ఆలీ, సయ్యద్ రెహమాన్, హిదాయతుల్లా, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కేంద్ర గణాంక శాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో.. జీవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన క్విజ్‌లో పాల్గొని.. ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపల్ మనోహర్‌తో పాటు ఐసీ క్యాంపస్ ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ భాను మురళీధర్, గణాంక శాస్త్ర విభాగాధిపతి అమూల్య అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



నెహ్రూనగర్: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ గుంటూరు అర్బన్(1) సూపర్‌వైజర్ పి.నీలిమ పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం 10, 11, 56వ డివిజన్లలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు చిరు ధాన్యాలతో కూడిన పదార్థాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఐరన్, కాల్షియం పుష్కలంగా లభిస్తుందన్నారు. అంగన్‌వాడీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు

- చినరావూరు, నందివెలుగులో సభలు
- రూ.9.52కోట్ల నగదు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్



నందివెలుగులో నగదు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యం చేసిన స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జవసత్వాలిస్తోందని, సంక్షేమ పథకాలతో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్‌లోని నందివెలుగు, పట్టణ చినరావూరులో సోమవారం వైఎస్సార్ ఆసరా సంబరాలను నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన డ్వాక్రా మహిళలకు రెండు చోట్ల కలిపి రూ.9.52 కోట్ల నగదు చెక్కులను ఆయన అందజేశారు. నందివెలుగు సభకు తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సాయం డ్వాక్రా మహిళల కష్టానికి వేన్నీళ్లకు చన్నీళ్లలా ఉపకరిస్తోందని ఎమ్మెల్యే శివకుమార్ పేర్కొన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వం చేస్తున్న మంచిని గురించి మహిళలు ఆలోచన చేయాలన్నారు. మూడున్నరేళ్లలో కేవలం నందివెలుగు గ్రామానికే.. వివిధ సంక్షేమ పథకాల కింద రూ.20.69 కోట్ల సాయం అందినట్లు గణాంకాలతో సహా వివరించారు. అనంతరం పది గ్రామాలకు కలిపి రూ.7.48 కోట్ల చెక్కును అందజేశారు. జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్ కుమార్, ఎంపీటీసీలు తిన్నలూరి విజయలక్ష్మి, షేక్ జిలాని బాషా, ధర్మరాజుల చెన్నకేశవులు, చక్కా సీతమ్మ, హాఫ్‌పేట సర్పంచ్ టి.ఎర్రయ్య పాల్గొన్నారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు.

పట్టణ చినరావూరులో..

చినరావూరులోని కమ్యూనిటీ హాలు ఆవరణలో మధ్యాహ్నం జరిగిన సభలో 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల పరిధిలోని డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.2.04 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అందజేశారు. చైర్‌పర్సన్ ఖలేదా నసీం, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కొత్ర యశోద, కుర్రా సుజాత, షేక్ గౌసియా, దాసరి వీరవసంతరావు, కాళిదాసు సత్యం, 'మెప్మా' మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

'ఐఈసీఈ'కి 169మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: విశాఖపట్నం కేంద్రంగా గల ఇంపీరియల్ ఎడ్యుకేషనల్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ (ఐఈసీఈ) సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ఫైనలియర్ విద్యార్థులు 169 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. కాలేజీలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితుల కారణంగా ఐటీ సెక్టార్‌లో ఉద్యోగాలు తగ్గాయన్నారు. ఈ నేపథ్యంలో నాన్ ఐటీ సెక్టారులోని ఉపాధిపై దృష్టి పెట్టడంతో.. తమ విద్యార్థులు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని చెప్పారు. వీరికి ఏడాదికి రూ.2.40 లక్షల వేతనం, వసతి సౌకర్యం కంపెనీ కల్పిస్తుందని తెలిపారు. కాలేజీలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉద్యోగంతో బయటకు వెళ్లాలనేది తమ లక్ష్యంగా వివరించారు. వీరితో కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఉన్నారు.

కనీస మద్దతు ధర కల్పించాలి

కొల్లిపర: దేశ వ్యాప్తంగా 150 రకాలకు పైగా పంటలను రైతులు పండిస్తుంటే కేంద్ర ప్రభుత్వం కేవలం 22 రకాలకే మద్దతు ధర ప్రకటించడం అన్యాయమని, అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అత్తోట, దంతలూరు, మున్నంగి గ్రామాల్లో ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయ వంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎఫ్‌సీఐ, సీపీఐని మూసి వేయడం వల్ల ప్రైవేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన దుస్థితిని కల్పించబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కమిటీ సభ్యులు ముద్దన సాంబ శివరావు, రైతులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, కుర్రా కోటేశ్వరరావు, దేశబోయిన వెంకటేశ్వరరావు , ఏడుకొండలు, డి.వెంకటేశ్వరరావు, తుల్లిమిల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తెనాలిలో ప్రపంచ రంగస్థల దినోత్సవం



సీనియర్ నటుడు యోహానుకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా కవి పండితుడు పొన్నపల్లి గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం ఆవిర్భావాన్ని విశదీకరించారు. సీనియర్ నటుడు, రచయిత పెద్దిటి యోహానుకు ప్రపంచ రంగస్థల దినోత్సవ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రంగస్థల నటులు డైరీ మూర్తి, ఇంద్ర జాలికుడు, నటుడు శేఖర్, మల్లేశ్వరరావు, హేమంత్, కేవీరామకృష్ణ, ప్రేమ్‌కుమార్ మాట్లాడారు.

మా–ఏపీ కార్యాలయంలో..

పట్టణ ఆలపాటి నగర్‌లోని మా–ఏపీ కార్యాలయంలో సాయంత్రం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడారు. రంగస్థలం కళాకారులకు జన్మస్థలమని పేర్కొన్నారు. కళాకారులకు చక్కని భవిష్యత్ ఉన్నప్పుడే రంగస్థలం వెలుగుగొందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు వయసుతో నిమిత్తం లేకుండా పేద కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

కేవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: చినరావూరులోని కేంద్రియ విద్యాలయంలో 1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 17లోపు కేంద్రియ విద్యాలయ సంఘటన్ వైబ్ సైట్(http://kvsonlionaddmission.kvs.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023 మార్చి 31లోపు ఆరేళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. పై తరగతులకు ఖాళీల ఆధారంగా ఏప్రిల్ 3 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలు విడుదలైన పది రోజులకు 11వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను కేంద్రీయ విద్యాలయంలో స్వయంగా అందజేయవచ్చని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సంక్షేమం, అభివృద్ధి, ప్రజా శ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 15వ వార్డు స్వరాజ్ సెంటర్ నుంచి సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు గుంటూరు గోపీ సంయుక్త ఆధ్వర్యంలో వార్డు నాయకులు అధిక సంఖ్యలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవడానికి, సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న 15వ వార్డులో ఇప్పటి వరకు రూ.3.40 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సంక్షేమం పథకాల ద్వారా రూ.37.13కోట్ల నిధులను వెచ్చించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, షేక్ దుబాయ్‌బాబు, ఆవుల కోటయ్య, తోట రఘురామ్, కుర్రా సుజాత, 15వ వార్డు నాయకులు మేడిపల్లి ప్రభాకర్, సుంకర కొండలరావు, చెన్ను శ్రీనివాసరావు, సురపుల వెంకట్రావు, సుబ్రహ్మణ్యం మాష్టారు, మామిడి బత్తుల సుబ్రహ్మణ్యం, హరిదాసు గౌరీశంకర్, పీకా నాగరాజు, శివరామకృష్ణ, కౌజర్ జాహా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య హక్కు చట్టాన్ని ఉప సంహరించుకోవాలి



సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: రాజస్థాన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్య హక్కు చట్టం అమలును ఉప సంహరించుకోవాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు దేశ వ్యాప్త నిరసనలో భాగంగా ఐఎంఏ తెనాలి శాఖ వైద్యులు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అధ్యక్షుడు డాక్టర్ జె.కోటి నాగయ్య మాట్లాడుతూ విధి విధానాలు సరిగా లేని చట్టాన్ని రూపొందించి, అమలు చేయడమే కాకుండా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులపై పోలీసులు లాఠీ ఝుళిపించడం దారుణమన్నారు. రాజస్థాన్ ప్రభుత్వం సదరు చట్టాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతి పత్రం అందజేశారు. కె.అనిల్‌కుమార్, ఇ.శ్రీకాంత్, పావని ప్రియాంక, చందు సాంబ శివుడు, జేవీ సుబ్బారావు, బీసీహెచ్ సాంబిరెడ్డి తదితర వైద్యులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం వనస్థలిపురంకు చెందిన బేల్దార్ మేస్త్రిగా పనిచేసే చెంగంరెడ్డి కోటిరెడ్డి (35) వనస్థలిపురంలోనే ఒక ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అనంతరం అక్కడే కార్మికులతో కలిసి మద్యం తాగి నివాసంలోని అటకపై పడుకునేందుకు గోడ ఎక్కుతున్న క్రమంలో కిందపడ్డాడు. దీంతో గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వచ్చి చికిత్స చేయించిన అనంతరం కోటిరెడ్డిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావం కలిగిన కార్యకర్తలకు గుర్తింపు

మంత్రి నాగార్జున న్యాయ సలహాదారు గుంటూరు కృష్ణ



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు కృష్ణకు సత్కారం

తెనాలి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున న్యాయ సలహాదారుగా నియమితులైన స్థానిక న్యాయవాది గుంటూరు కృష్ణను తెనాలి బార్ అసోసియేషన్ సోమవారం ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ హాలులో జరిగిన అభినందన సభకు అధ్యక్షుడు మందలపు వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న గుంటూరు కృష్ణ కృషికి తగిన ఫలితం దక్కిందని ఆయన అన్నారు. నియామకానికి కృషి చేసిన మంత్రి డాక్టర్ నాగార్జున, సహకరించిన తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. గుంటూరు కృష్ణ మాట్లాడుతూ పార్టీకి అంకిత భావంతో పనిచేసిన కార్యకర్తలకు తగిన సమయంలో తగిన గౌరవం దక్కుతుందన్నారు. అందుకు తన నియమకాన్ని ఉదహరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, న్యాయవాదులు సోలా శంకర్, కంచర్ల ఇజ్రాయిల్, కంచర్ల కోటేశ్వరరావు, మధిర సురేష్, ఇందుపల్లి రాజారామ్, షేక్ ఖాదర్, గుమ్మడి రవిరాజ్, పెదపూడి భూషణం, కనపర్తి మధుకర్, అమీర్‌జాన్, కొమ్ము అబ్రహాం లింకన్, ఉన్నం రాజశేఖర్, ఆదియ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ



కంపోస్టు ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

తెనాలిటౌన్: కొలకలూరులో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం సోమవారం ఐదో రోజుకు చేరింది. ప్రోగ్రాం ఆఫీసర్, ప్రొఫెసర్ ప్రసన్న కుమారి పర్యవేక్షణలో విద్యార్థినులు గ్రామంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక వాడకం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. గ్రామంలోని చెరువు చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం మహిళా రైతులకు కంపోస్ట్ ఎరువును ప్రత్యక్షంగా తయారు చేసి, వివరించారు. పశువుల ఎరువు, ఇంట్లోని కూరగాయాల చెత్త, ఎండిన ఆకులు వంటి వ్యర్థాలతో ఎన్నో పోషక విలువలు కలిగినటువంటి కంపోస్టును తయారీ, వినియోగాన్ని తెలిపారు. కా ర్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్న కుమారి, నా గలక్ష్మి, మహిళా రైతులు, కమాదుల సుబ్బలక్ష్మి, కో టేశ్వరమ్మ, అత్తలూరి వెంకాయమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గుంటూరు మెడికల్: జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు సోమవారం గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 1500 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహాయంతో మజ్జిగ పంపిణీ చేశామని, దాతలకు ట్రస్టు నిర్వాహకులు పఠాన్ అల్లాభక్షు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందన'లో 9 అర్జీలు

తెనాలి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన సమావేశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. సోమవారం స్పందన సమావేశంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయి. వీటిలో సీనియర్ సిటిజన్ చట్టం కింద న్యాయం చేయాలని కోరుతూ ఒక అర్జీ రాగా, ట్రాఫిక్, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి, ఓటీఎస్ అమలుకు, నష్ట పరిహారం ఇప్పించాలని, విద్యుత్, కమ్యూనిటీ, ఆర్ఓఆర్ అంశాలపై అర్జీలు వచ్చాయి. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ పోస్టులకు ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. 31న దరఖాస్తు ల పరిశీలన, ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు ఇంటర్వ్యూలు, 6న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటన, అదేరోజు విధులకు హాజరు కావాల్సి ఉంటుందని వివరించారు. అర్హులు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రంగస్థల పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై హైదరాబాద్ కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డి. తిరుమలేశ్వరరావు సంయుక్త నిర్వహణలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా సోమవారం రంగస్థల పురస్కారాల ప్రదాన సభ నిర్వహించారు. ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, అతిథులుగా ప్రగతి కళామండలి అధ్యక్షుడు నూతలపాటి సాంబయ్య, ప్రముఖ సినీ నటులు నాయుడుగోపి, రాఘవరెడ్డి, మహమ్మద్ రఫి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాట్లాడుతూ సామాజికంగా అనేక రకాల సందేశాలను ప్రజలకు అందిస్తున్న రంగస్థల కళాకారులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్న కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ఉగాది పురస్కార గ్రహీతలైన వరికూటి శివప్రసాద్‌కు గురజాడ పురస్కారం, యు.సుబ్బరాయశర్మకు బళ్లారి రాఘవ పురస్కారం, ఎంవీఎల్ నరసింహారావుకు సీఎస్ఆర్ పురస్కారం, కృష్ణేశ్వరరావుకు గరికపాటి రాజారావు పురస్కారం, ఎస్.ఆంజనేయులు నాయుడుకు పసారస గోవిందరావు పురస్కారం, కె.వెంకటకృష్ణకు రఘురామయ్య పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. సభానంతరం చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించి ప్రదర్శించిన ప్రక్షాళన సందేశాత్మక నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను జి. మల్లికార్జునరావు, జీవీజీ శంకర్ పర్యవేక్షించారు.

మూడు దేవస్థానాల్లో కానుకల లెక్కింపు

యడ్లపాడు: మండలంలోని మూడు ఆలయాల్లో దేవాదాయ శాఖ అధికారులు హుండీ లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ మూడు ఆలయల హుండీల్లో భక్తులకు సమర్పించిన నాణేలు, కరెన్సీ మొత్తం రూ.1,34,307 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆయా ఆలయాలు, కానుల వివరాలు..మండలకేంద్రమైన యడ్లపాడు గ్రామంలోని రణవీరాంజనేయస్వామి దేవస్థానంలో రూ.1,12095, సొలస గ్రామంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో రూ.14, 421, అలాగే కొండవీడు గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రూ.7,791 భక్తులు కానుకలు హుండీల్లో వేసినట్లు అధికారులు తెలిపారు.

31లోపు వడ్డీ రాయితీతో పన్నులు చెల్లించొచ్చు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఏకమొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, మరో 4 రోజుల్లో ఆ గడువు ముగుస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మార్చి 31లోపు పన్ను చెల్లించకుంటే వడ్డీ రాయితీ వర్తించదని, ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. నగరంలో నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్ను పై వడ్డీ రాయితీ ప్రకటించడం సదవకాశమని, అటువంటి వారు వెంటనే పన్ను చెల్లించాలన్నారు. లేకుంటే మార్చి తర్వాత వడ్డీ కలిసి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

లారీ ఢీ కొని.. తెనాలి యువకుడి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన దిలీప్

నారాకోడూరు(చేబ్రోలు): గుర్తు తెలియని మినీ లారీ ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నారాకోడూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. నారాకోడూరు పరిధిలోని శ్రీనివాస చికెన్ స్టాల్ ఎదురుగా జీబీసీ రహదారిపై బైక్‌పై వెళ్తున్న యువకుడిని వేగంగా వెళ్తున్న మినీ లారీ ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. హెల్మెట్ ధరించినప్పటికీ యువకుడు తలపగలి ప్రమాద స్థలంలోని దుర్మరణం చెందాడు. మృతుడు తెనాలి చెంచుపేటకు చెందిన దిలీప్ అనే వ్యక్తిగా తెలుస్తోంది. గుంటూరు బెస్ట్ ప్రైస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు ఆలయాల్లో కానుకల లెక్కింపు



పాత గుంటూరు: కొత్తపేట ఆంజనేయస్వామి, జగన్నాథ స్వామి దేవస్థానాలు, లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీల కానుకలు లెక్కించారు. పొన్నూరు ఆంజనేయ స్వామి ఆలయం ఈఓ టి.శ్రీనివాస్ పర్యవేక్షణలో చైర్మన్ పి.జయప్రకాష్‌రెడ్డి, సభ్యుల సమక్షంలో సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. జగన్నాథస్వామి ఆలయంలో రూ. 25, 548, ఆంజనేయస్వామి ఆలయంలో రూ.4,07,551, వేంకటేశ్వర స్వామి ఆలయంలో రూ. 5,82,724 ఆదాయం వచ్చిందని, మొత్తం రూ.10,15, 823 ఆదాయం వచ్చింది. ఆలయాల ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.